పార్టీ సేవలకు అందలం

● ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఐదుగురు టీడీపీ నాయకులకు కీలక పదవులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండో విడత నామినేటెడ్ పోస్టుల జాబితాను శనివారం ప్రకటించింది. ఇందులో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఐదుగురికి కీలక పదవులు లభించాయి.చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (చుడా) ఛైర్‌పర్సన్‌గా మాజీ మేయర్ కటారి హేమలతను నియమించారు.చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్‌కు వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్‌గా అవకాశం ఇచ్చారు.యాదవ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా టీడీపీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహ యాదవ్‌ను ఎంపిక చేశారు. నాయీ బ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా టీడీపీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు రుద్రకోటి సదాశివం నియమితులయ్యారు.ఏపీ స్టేట్ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్‌గా టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నీలాయపాళెం విజయకుమార్‌ను నియమించారు.

– చిత్తూరు/తిరుపతి, ఆంధ్రజ్యోతి

సముచిత స్థానం



చిత్తూరు మాజీ మేయర్ కటారి హేమలత.. తొలి విడత నామినేటెడ్ పోస్టుల జాబితాలో టూరిజం డైరెక్టర్‌గా అవకాశం ఇచ్చారు. అయితే అది ఆమెకు తగిన పదవి కాదని పార్టీ వర్గాలతో పాటు ఆమె అభిమానుల్లో అసంతృప్తి వ్యక్తమైంది.ఆమె మాత్రం పార్టీ మీద గౌరవం, నమ్మకంతో తన అసంతృప్తిని ఎక్కడా బయటపెట్టలేదు. చంద్రబాబును కలిసి మరోసారి పరిశీలించాలని కోరడంతో రెండో జాబితాలో ఆమెకు చుడా ఛైర్‌పర్సన్‌గా అవకాశం లభించింది.2016లో తన అత్త కటారి అనురాధ, ఆమె భర్త మోహన్ హత్యకు గురైన తర్వాత మేయర్ అయిన హేమలత పాలనలో తనదైన ముద్ర వేశారు. 2019లో పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత ఐదేళ్ల ప్రతిపక్షంలో ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. వైసీపీ అక్రమాల్ని ప్రశ్నించడంతో అక్రమ కేసుల్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. కరోనా సమయంలో భర్త ప్రవీణ్‌ను కోల్పోయాక ఒంటరిగా పార్టీకోసం పోరాడుతూ వచ్చారు. ఆరుగురు ఎమ్మెల్యే టికెట్ ఆశావహుల్లో ఆమె కూడా ఉండి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గురజాల జగన్మోహన్‌కు టికెట్ వచ్చినా.. ఆయన గెలుపు కోసం శ్రమించారు.

టీడీపీతో సుదీర్ఘ అనుబంధం



యాదవ సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన నరసింహ యాదవ్ కుటుంబం సుదీర్ఘంగా టీడీపీలో ఉంది.2014లో టీడీపీ అధికారంలోకి వచ్చినప్పుడు తుడా ఛైర్మన్‌గా నరసింహ యాదవ్‌కు అవకాశం ఇచ్చింది. ఆ తర్వాత 2019లో టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడిగా నియమించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక టీటీడీ, తుడాపై ఆయన ఆశలు పెట్టుకున్నారు. మూడు పార్టీల మధ్య సర్దుబాటు క్లిష్టంగా ఉన్నప్పటికీ అధిష్ఠానం మాత్రం నరసింహ యాదవ్‌కు న్యాయం చేసిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

టీడీపీ స్వరం

మీడియా వేదికగా టీడీపీ స్వరం ధాటీగా వినిపించే నీలాయపాళెం విజయకుమార్‌కు ప్రతిష్ఠాత్మకమైన ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ పదవి లభించింది. ఈయన ఎస్వీ యూనివర్సిటీలో ఎకనామెట్రిక్స్‌లో ఎంఫిల్ చేశారు. కార్పొరేట్ కంపెనీల్లో కీలక బాధ్యతల్లో ఉంటూ రాజకీయాల్లోకి వచ్చారు. పదిహేనేళ్లుగా టీడీపీలో కీలక బాధ్యతల్లో ఉన్నారు.ప్రస్తుతం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారు.



ఇచ్చిన మాట ప్రకారం



తిరుచానూరుకు చెందిన సీఆర్ రాజన్ గతంలో సర్పంచిగా పనిచేశారు. వన్నియకుల క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన ఆయన చిత్తూరు అసెంబ్లీ టికెట్ కోసం పోటీపడ్డారు.చిత్తూరులో కార్యాలయాన్ని కూడా ప్రారంభించారు.అందరితో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. గురజాల జగన్మోహన్‌కు టికెట్ దక్కడంతో ఆయన నిరాశ చెందారు. దీంతో ఆయనకు పార్టీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడిగా అవకాశం కల్పించింది. ఆయన కూడా గురజాలతో కలిసి పనిచేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరి రోజున చిత్తూరు మురకంబట్టుకు వచ్చిన చంద్రబాబు 'కొన్ని కారణాలతో సీఆర్ రాజన్‌కు టికెట్ ఇవ్వలేకపోయాం. పార్టీ వచ్చాక సముచిత స్థానం కల్పిస్తాం'అని ప్రకటించారు. దీంతో రాజన్‌కు సముచిత స్థానం లభించింది. వన్నియకుల క్షత్రియ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్‌గా నియమించారు.

జయహో బీసీతో గుర్తింపు



ఏపీ నాయీ బ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన రుద్రకోటి సదాశివం పార్టీలో అనేక బాధ్యతలను నిర్వహించారు. టీడీపీ జిల్లా బీసీ సెల్ ప్రచార కార్యదర్శిగా, టీఎన్‌టీయూసీ నాయకుడిగా,నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్ కమిటీ సభ్యుడిగా పనిచేశారు. 2022 నుంచి తిరుపతి పార్లమెంటు బీసీ సెల్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. వీటితో పాటు వాయిద్య కళాకారుల సంక్షేమ సంఘం తిరుపతి అధ్యక్షుడిగా, వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా డిప్యూటీ గవర్నర్‌గా ఉన్నారు. జిల్లావ్యాప్తంగా జయహో బీసీ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించి అధిష్ఠానం వద్ద గుర్తింపు తెచ్చుకున్నారు.

● తాజా రాజకీయం



ఛైర్మన్‌గిరీ నాదే!

కుప్పం మున్సిపల్ ఛైర్మన్ పదవికోసం మొదలైన పోటీ

వేడెక్కుతున్న అధికార, విపక్ష రాజకీయాలు

'ఎవురెవురి పేర్లో ఇనిపిస్తా వుండాయి. నేనుగూడా అడగతా, తప్పేం ఉండాది. నాకేం తక్కవయింది?' ఇటీవల కుప్పం కౌన్సిల్ సమావేశం ముగిశాక వెలుపలికి నడుస్తూ ఒక కౌన్సిలర్ తరపున అధికారం అంతా తానే చలాయించే వ్యక్తి ఆవేశంగా అన్న మాట ఇది. కార్యకర్తనుంచి ద్వితీయ శ్రేణి నాయకుల దాకా ప్రస్తుతం ఇదేమాట వినిపిస్తోంది. ఖాళీ అయిన మున్సిపల్ ఛైర్మన్ కుర్చీలో కూర్చోవడానికి అధికార పార్టీలో తహతహ పెరిగిపోతుండగా, దాన్ని ఎలాగైనా తిరిగి దక్కించుకోవాలన్న దుగ్ధ వైసీపీలో ఎక్కువవుతోంది.

కుప్పం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నుంచి మున్సిపల్ ఛైర్మన్‌గా ఎన్నికైన డాక్టర్ సుధీర్ టీడీపీలో చేరిన విషయం తెలిసిందే. 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో మొత్తం 25 కౌన్సిలర్ స్థానాలకుగాను అప్పటి అధికార పార్టీ వైసీపీ 19 గెలుచుకోగా మిగిలిన 6 స్థానాలను టీడీపీ కైవశం చేసుకుంది. 2024లో టీడీపీ అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే వైసీపీనుంచి ఐదుగురు కౌన్సిలర్లు బయటకు వచ్చి ఈ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరిలో ఒకరు తిరిగి వెనక్కు వెళ్లిపోయారు. వైసీపీ తరపున కౌన్సిలర్‌గా గెలిచి మున్సిపల్ ఛైర్మన్ అయిన డాక్టర్ సుధీర్ ఈనెల 4న ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. చేరేముందే ఆయన తన ఛైర్మన్ పదవితోపాటు కౌన్సిలర్ పదవికి కూడా రాజీనామా చేశారు. ఇప్పుడు కుప్పం మున్సిపల్ కౌన్సిల్‌లో వైసీపీకి 14 మంది, టీడీపీకి 10మంది కౌన్సిలర్లు మిగిలారు. ఈ నేపథ్యంలో టీడీపీ వర్గాల్లో మున్సిపల్ ఛైర్మన్ పదవిపై ఆశలు రేగుతున్నాయి. పైన చెప్పిన కౌన్సిలర్ సమీప బంధువుతోపాటు టీడీపీనుంచి గెలిచిన ఆరుగురు, ఇంకా పార్టీలోని వ్యక్తులు కొందరు ఆ పదవికోసం ఉవ్విళ్లూరుతున్నారు.

● ఖాళీ అయిన స్థానంనుంచి..

మున్సిపల్ ఛైర్మన్‌గా గెలిచి రాజీనామా చేసిన డాక్టర్ సుధీర్ 16వ వార్డునుంచి వైసీపీ తరపున ఎన్నికల్లో గెలిచి కౌన్సిలర్ అయ్యారు. ఆయన ఈ కౌన్సిలర్ పదవిని కూడా వదులుకోవడంతో ప్రస్తుతం ఆ స్థానం ఖాళీగా ఉంది. ఈ వార్డుకు కొత్తగా ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ వార్డునుంచి నిలబడి ఏకంగా ఛైర్మన్ పదవిని కొట్టేయడానికి అధికార టీడీపీలో పలువురు కాసుకుని ఉన్నారు. వీళ్లలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి వీజీ. ప్రతాప్, ప్రతిపక్షంలో ఉండగా ప్రమాదానికి గురై మంచంలో ఉన్న టీడీపీ కుప్పం టౌన్ మాజీ ప్రెసిడెంట్ త్రిలోక్ సతీమణి భాగ్యలక్ష్మి పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. వీళ్లిద్దరూ ఛైర్మన్ కావాలంటే ముందుగా ఖాళీ అయిన 16వ వార్డు నుంచి ఎన్నికల్లో నిలబడి గెలవాల్సి ఉంది. టీడీపీ నుంచి 19వ వార్డు కౌన్సిలర్‌గా గెలిచి, కౌన్సిల్‌లో పార్టీ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న జిమ్ దాము ఎప్పటి నుంచో ఛైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. వీరుగాక, ఎన్నికల ముందు కాంగ్రెస్‌నుంచి టీడీపీలో చేరి ఏకంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి పదవితోపాటు, కుప్పం నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్ష పదవి పొందిన డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు కూడా లైన్‌లో ఉన్నట్లు చెబుతున్నారు. ఇవి బహిరంగంగా వినిపిస్తున్న పేర్లు. డాక్టర్ సురేశ్ తప్ప ఇంతకుముందు చెప్పిన వారిలో ఒకరిద్దరు తమకే ఛైర్మన్ పదవి లభిస్తుందని, అధిష్ఠానంనుంచి ఆ మేరకు హామీ లభించిందని కూడా బహిరంగంగానే చెప్పుకుంటూ తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో మిగిలిన అధికార పార్టీ కౌన్సిలర్లు, పార్టీలో చిన్నాచితకా నాయకత్వ స్థానాల్లో ఉన్నవారు చాలామంది రంగంలోకి దిగిపోతున్నారు. అందరూ అడుగుతున్నప్పుడు తమకేం తక్కువయిందని ప్రశ్నిస్తున్నారు. ఒక మాట అడిగి పెడితే తర్వాత ఏమైతే అదవుతుందని బయలుదేరుతున్నారు. అదే సమయంలో అటు వైసీపీ జిల్లా అధిష్ఠానం కూడా రంగంలోకి దిగింది. ఇప్పటికీ అత్యధిక కౌన్సిలర్లు తమ పార్టీవారే కావడంతో వారిని బయటకు వెళ్లకుండా కట్టడి చేయడానికి ప్రయత్నిస్తోంది. ఇటీవల ఆ పార్టీ ఎమ్మెల్సీ భరత్ తమ కౌన్సిలర్లతో సమావేశమై, వారి భవిష్యత్తుకు భరోసా ఇచ్చినట్లు తెలిసింది. తిరిగి ఎలాగైనా తమ పార్టీ కౌన్సిలర్‌నే మున్సిపల్ ఛైర్మన్ పదవిలో కూర్చోబెట్టడానికి జిల్లా స్థాయిలో కూడా వైసీపీ అధిష్ఠానం ప్రయత్నాలను ముమ్మరం చేసింది. సమీప భవిష్యత్తులో మున్సిపల్ ఛైర్మన్ పీఠం కేంద్రంగా కుప్పం మున్సిపాలిటీలో రాజకీయాలు రసవత్తరంగా మారే అవకాశం ఉంది.

సీఎం ఫ్యామిలీ ఫొటోల మార్ఫింగ్ కేసుల్లో ఇద్దరి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం)/వెదురుకుప్పం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన భార్య భువనేశ్వరి, కోడలు బ్రాహ్మణి ఫొటోలు అశ్లీలంగా మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చేసిన వైసీపీ సానుభూతిపరుడు సంజీవరెడ్డిని శనివారం తిరుపతి ఈస్ట్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ రామకృష్ణ కథనం మేరకు....అనంతపురం జిల్లా బెలుగుప్పకు చెందిన సంజీవరెడ్డి కొంత కాలంగా తిరుపతిలో వుంటున్నాడు.ముఖ్యమంత్రితో పాటు ఆయన భార్య,కోడలి ఫొటోలు అశ్లీలంగా మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చేశాడు.దీనిపై టీడీపీ నాయకుడు మధుబాబు ఫిర్యాదు చేయడంతో శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.ముఖ్యమంత్రి సతీమణి భువనేశ్వరి ఫొటోలను సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టు చేశారంటూ ఇచ్చిన ఫిర్యాదుతో హైదరాబాద్‌కు చెందిన కార్నె సైదిరెడ్డిపై కార్వేటినగరం పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా శనివారం నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

టీడీపీ సోషల్ మీడియాపై చర్యలు తీసుకోండి

మాజీ ముఖ్యమంత్రి జగన్‌పై తప్పుడు పోస్టులు పెడుతున్న టీడీపీ సోషల్ మీడియాకు చెందిన వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి శనివారం ఏఎస్పీ రవి మనోహరాచారిని కలసి వినతి పత్రం అందచేశారు.దీనికి సంబంధించి ఫేస్‌బుక్ లింక్‌లను ఏఎస్పీకి అందజేశారు.

హౌసింగ్ అవకతవకలపై

కఠిన చర్యలుంటాయి

గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణం, కేటాయింపుల్లో అవకతవకలు జరిగాయని, దీనిపై జేసీతో విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు.తిరుపతి కలెక్టరేట్‌లో శనివారం ఉమ్మడి చిత్తూరు జిల్లా హౌసింగ్ శాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో హౌసింగ్ లే అవుట్లలో ఇంటి పట్టాలు చేతులు మారడం, కొన్ని ఇళ్ల నిర్మాణం జరగకపోయినా ప్రభుత్వం నుంచి సొమ్ము డ్రా చేయడం వంటివి జరిగాయని, ఎమ్మెల్యేల ఫిర్యాదు మేరకు విచారణకు ఆదేశించామని చెప్పారు. నివేదిక రాగానే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. డిసెంబర్ నాటికి రాష్ట్రంలో లక్ష ఇళ్లు పూర్తి చేసి, లబ్ధిదారులకు అప్పగిస్తామన్నారు. పీఎంఏవై 1.0లో రెండు జిల్లాలకు మంజూరైన గృహాలు 50 శాతం పూర్తయ్యాయని, పలు నియోజకవర్గాల్లో 70శాతం పూర్తయ్యాయని, కొన్నిచోట్ల ఇసుక సమస్య కారణంగా గృహ నిర్మాణ పనులు ఆలస్యమయ్యాయని తెలిపారు. హౌసింగ్ నిర్మాణానికి ఇసుక ఇవ్వాలని అధికారులకు సూచించామన్నారు. ఇళ్ల నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులకు బిల్లు సమర్పించిన వారంలోపే ఖాతాల్లో డబ్బులు పడే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజారంజక పాలన చూడలేకే వైసీపీ సోషల్ మీడియా ద్వారా దుష్ప్రచారం చేస్తోందన్నారు. సమాచార శాఖ అధికారి భూ కుంభకోణానికి పాల్పడ్డాడని మీడియా ప్రతినిధులు మంత్రి దృష్టికి తీసుకురాగా భూములను ఎవరు కబ్జా చేసినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు పులివర్తి నాని, మురళీమోహన్ పలు సమస్యలను, అవినీతి ఆరోపణలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.జేసీ శుభం బన్సల్, ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, నెలవల విజయశ్రీ, డీఆర్వో నరసింహులు, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, హౌసింగ్ సీఈ ప్రసాద్, ఎస్ఈ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

విమానాశ్రయంలో మాక్‌డ్రిల్



మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న ఆక్టోపస్, సీఐఎస్ఎఫ్, పోలీసు బృందాలు

రేణిగుంట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయానికి ఇటీవల వరుసగా బాంబు బెదిరింపులు రావడంతో అప్రమత్తమైన పోలీసు యంత్రాంగం శనివారం తెల్లవారుజామున 1.30గంటలకు ఆక్టోపస్, సీఐఎస్ఎఫ్, పోలీసులు సంయుక్తంగా మాక్ డ్రిల్ నిర్వహించారు. విమానాశ్రయంలోకి ప్రయాణికుల ముసుగులో తీవ్రవాదులు ప్రవేశిస్తే ఎలా ఎదుర్కోవాలి అనే అంశంపై డ్రిల్ చేశారు. అదే సమయంలో విస్ఫోటనాలు జరిగితే ప్రాణనష్ట నివారణకు తీసుకోవాల్సిన అంశాలపైనా మాక్‌డ్రిల్ చేశారు. కార్యక్రమంలో ఆక్టోపస్ డీఎస్పీ కృష్ణబాబు, సీఐ రాంబాబు, సీఐఎస్ఎఫ్ కమాండంట్ శుక్ల, రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.49 కోట్లు

తిరుమల, నవంబరు9(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.3.49 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయం వివరాలను టీటీడీ శనివారం ఉదయం ప్రకటించింది. శుక్రవారం 64,983 మంది భక్తులు దర్శించుకున్నారు. 25,324 మంది తలనీలాలు సమర్పించారు.

శ్రీవారి సేవలో హీరో నిఖిల్...



సినీ యువ హీరో నిఖిల్ శనివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ఆలయం వెలుపలకు వచ్చిన నిఖిల్‌ను చూసేందుకు పలువురు అభిమానులు ఉత్సాహం చూపారు. ఆయనతో సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

కళ్యాణ వైభోగమే

ఆకాశం దిగివచ్చి మబ్బులతో వెయ్యాలి మన పందిరి..ఊరంతా చెప్పుకునే ముచ్చటగా సాగాలి పెళ్లంటే మరి..

అంటారు సిరివెన్నెల సీతారామశాస్త్రి ఓ సినిమాపాటలో. ఎవరెన్ని చెప్పినా పెళ్లంటే సందడికి ప్రత్యామ్నాయమే. అందుకే పెళ్లి అనగానే ఎంత హడావుడి పడుతుంటారో. ఇదంతా ఒక సంగతయితే కొన్ని రోజులుగా పెళ్లి సందడి కనిపించడం లేదు. కారణం ముహూర్తాలు లేకపోవడమే. మూడు నెలలపాటు మూఢం రావడంతో శుభ కార్యాలయాలకు సెంటిమెంటు అడ్డొచ్చింది. ఆశ్వయుజ మాసంలో కొన్ని ముహూర్తాలున్నా చాలామంది దీపావళి తర్వాత వచ్చే కార్తీకమాసం ముహూర్తాలపైనే ఆసక్తి చూపుతున్నారు. మార్గశిర మాసంలో కూడా మంచి బలమైన ముహూర్తాలున్నాయని పురోహితులు చెబుతున్నారు. దీంతో వధూవరుల తల్లిదండ్రులు ఈ రెండు నెలల ముహూర్తాల్లోనే వివాహం చేయాలని సిద్ధపడుతున్నారు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి



మోగనున్న పెళ్లి భాజాలు

ఈ రెండు నెల్లో ఎక్కువ శుభ ముహూర్తాలు

ఇప్పటికే బుక్ అయిన కళ్యాణ మండపాలు

పురోహితుల నుంచి ఫొటో గ్రాఫర్ల వరకూ డిమాండ్

ఇప్పుడు కాకుంటే మాఘం వరకూ ఆగాల్సిందే..

పెళ్లిళ్లకే కాదు వివిధ ఉపనయనాలు, గృహ ప్రవేశాలు లాంటి శుభ కార్యక్రమాలకూ ఈనెల 10 నుంచి 28వరకూ, అలాగే డిసెంబరు 4 నుంచి 16వ తేదీ వరకు అంటే సుముహూర్తాలు ఉన్నాయి. ఈ ముహూర్తాల తర్వాత మాఘమాసం వరకూ ఆగాల్సిందే. అందుకే అందరూ త్వరపడుతున్నారు. ఈ నేపథ్యంలో మూఢంలో ముహూర్తాలు లేక దిగాలుపడిన వారందరిలో ఇప్పుడు జోష్ కనిపిస్తోంది. వివాహ సంబంధ వ్యవహారాలతో ముడిపడినవారంతా బిజీబిజీగా కనిపిస్తున్నారు. కళ్యాణ వేదికలకు చాలా డిమాండ్ ఏర్పడింది. ఈమధ్యనే పెళ్లి కుదుర్చుకున్న వారు వేదిక దొరక్క, దూరంగా వెళ్లయినా చేయాలకుకుంటున్నారు.

అందరూ బిజీబిజీ

గతంలో పెళ్లంటే హంగూ ఆర్భాటం ఉండేది కాదు. ఇప్పుడు అన్ని వర్గాలవారూ వివాహం అందరూ గుర్తుంచుకునేలా చేయాలని ఆరాటపడుతున్నారు. ఇందుకోసం ఎంతయినా వెచ్చించడానికి సిద్ధపడుతున్నారు. ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు,బాజా భజంత్రీలవారు,కేటరింగ్, బ్యూటీషియన్లు, మెహందీ ఆర్టిస్టులు, షామియానా,కుర్చీలు సప్లయర్స్, ఆకర్షణీయ డెకరేటర్లు ఒకరేమిటి ఇలా చాలామంది వెంటపడాల్సి వస్తోంది. ఈ శ్రమ లేకుండా తామే అన్ని చూసుకుంటామంటూ ఈవెంట్ మేనేజర్లు పుట్టుకొచ్చారు. శుభ కార్యక్రమాలకు దివ్యమైన ముహూర్తాలు దగ్గర పడుతుండటంతో వీరందరికీ గిరాకీ ఏర్పడింది. రానున్న ముహూర్తాల్లో దాదాపు 10వేలకు పైగా పెళ్ళిళ్లు జరగనున్నాయని అంచనా.

తిరుపతిలో కళ్యాణ మండపాలకు డిమాండ్

తిరుపతిలో పెళ్లి చేయడానికి ఎక్కువ మంది ఆసక్తి కనపరుస్తున్నారు. ఇప్పటికే టీటీడీ కళ్యాణ మండపాలతో పాటు ప్రయివేటు, కార్పొరేట్, చిన్నా చితకా మండపాలు, మాల్స్ అన్నీ బుక్ అయిపోయాయని నిర్వాహకులు చెబుతున్నారు. కొన్ని మండపాల నిర్వాహకులు పెళ్ళి చేసే వారికి ఇబ్బంది లేకుండా కేటరింగ్, బ్యాండు మేళాలు, భోజనాలు, డెకరేషన్, పురోహితులు, ఇలా సర్వం ప్యాకేజీ రూపంలో ఏర్పాటు చేస్తున్నారు. మండపాల స్థాయిని బట్టి రూ.60 వేల నుంచి రూ.2లక్షల వరకు వసూలు చేస్తున్నారు. మరోపక్క బంగారు దుకాణాలు కొనుగోలుదారులతో సందడి సందడిగా కనిపిస్తున్నాయి. బట్టల షాపులూ రద్దీగానే ఉన్నాయి. నాణ్యత, మన్నికలను బట్టి పట్టుచీరలకు రేట్లు వసూలు చేస్తున్నారు. కనీసం రూ.5వేల నుంచి రూ.5లక్షల వరకు పట్టుచీరల ధరలు పలుకుతున్నాయి.

శుభ ముహూర్తాలు ఇవీ....

ఈనెల నుంచి మార్చి వరకు వివాహాది శుభ కార్యాలకు ముహూర్తాలున్నాయి.

ఈ నెలలో 10,14,16,17,20,22,27,28 తేదీలు

డిసెంబరు: 4,5,6,7,8,11,12,14,15,19,20,21,26,27,28

జనవరి : 31వ తేదీ మాత్రమే

ఫిబ్రవరి: 2,6,7,8,9,12,13,14,15,16,21,22,23,26

మార్చి: 2,6,9,12,15,16.

వివాహాలకు అనుకూలం

నవంబరు, డిసెంబరు నెలల్లో మంచి ముహూర్తాలు ఉన్నాయి. భాద్రపద మాసంలో వివాహాది శుభకార్యాలకు ముహూర్తాలు లేవు.. డిసెంబరు నెలాఖరు వరకు అనుకూలమైన ముహూర్తాలు ఉన్నాయి. మంచి రోజుల్లో శుభకార్యాలు చేసుకుంటే అంతా మంచి జరుగుతుందని శాస్త్రాలు చెబుతున్నాయి. అందుకే విశేష ముహూర్తాలకు అంత బలం.

-సత్యనారాయణ మూర్తి, పురోహితులు

ధరలతో ఆందోళన

ఐదారు సంవత్సరాలతో పోలిస్తే క్యాటరింగ్ సంస్థలు పెరిగాయి. ప్రస్తుతం నిత్యావసర వస్తువులు, ఆయిల్, బియ్యం, పప్పుల ధరలు దారుణంగా ఉన్నాయి. గతంలో ధరలకు భోజనం సమకూర్చాలంటే కష్టమే. ఇదే భయం మమ్మల్ని వెంటాడుతోంది. ఎలా ఉన్నా ఈ రెండు నెలలూ క్యాటరింగ్ నిర్వాహకులకు చేతినిండా పని ఉంటుంది

-కృష్ణమూర్తి, ఎస్‌కే క్యాటరింగ్, తిరుపతి

ఉమ్మడి జిల్లా జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చిన్నబాబు



చంద్రగిరి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వనపాకం డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ చిన్నబాబు ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీ ఎన్నికల అధికారి సురేష్ ఆధ్వర్యంలో శనివారం తిరుపతిలో అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. ఉపాధ్యక్షుడిగా లక్ష్మీప్రసాద్ జనరల్ సెక్రటరీగా శంకరప్ప, జాయింట్ సెక్రటరీగా రెహనా, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మధులను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా చిన్నబాబు మాట్లాడుతూ అసోసియేషన్ సభ్యుల సమస్యలను ప్రభుత్వంలోని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యాపారి దుర్మరణం



వీరాంజనేయులు (పాతచిత్రం)

శ్రీకాళహస్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యాపారి దుర్మరణం చెందాడు. శ్రీకాళహస్తి రూరల్ సీఐ రవినాయక్ కథనం మేరకు.. బాపట్లకు చెందిన ముత్యాల వీరాంజనేయులు(50) వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. బాపట్ల జిల్లాకు చెందిన అతని స్నేహితులు రంగారావు(52), గంధం కృష్ణమూర్తి(53)తో కలిసి కారులో బెంగళూరుకు శుక్రవారం బయలుదేరారు. శ్రీకాళహస్తి మండలం ఊరందూరు వద్ద నాయుడుపేట-రేణిగుంట జాతీయ రహదారిపై ఓ లారీ మరమ్మతులకు గురికావడంతో రోడ్డుపక్కన నిలిపివేశారు. శనివారం వేకువజామున 2గంటల ప్రాంతంలో బెంగళూరు వైపుగా వెళుతున్న వీరి కారు ఆగివున్న లారీని ఢీకొంది. వాహనం నడుపుతున్న వీరాంజనేయులు, రంగారావు, కృష్ణమూర్తి తీవ్రంగా గాయపడ్డారు. రూరల్ పోలీసులు క్షతగాత్రులను శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరాంజనేయులు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మరో ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. వీరాంజనేయులు మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పీఎఫ్ నిధులు స్వాహా

మ్యాన్ పవర్ ఏజెన్సీపై కార్మికుల ఫిర్యాదు

సత్యవేడు, నవంబరు 9: కార్మికులు కాయ కష్టం చేసి దాచుకున్న పీఎఫ్ సొమ్మును ఓ మ్యాన్ పవర్ ఏజెన్సీ స్వాహా చేసింది. దీంతో కార్మికులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటన శ్రీసిటీ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. శ్రీసిటీ పరిధిలోని ఐఎఫ్ఎఫ్ పరిశ్రమలో కొంత మంది కార్మికులు తమిళనాడుకు చెందిన వీపీజీ అనే మ్యాన్ పవర్ ఏజెన్సీ కింద పని చేస్తున్నారు. తమ వేతనం డబ్బుల నుంచి పొదుపు చేసుకున్న పీఎఫ్ నగదును దిగమింగేశారని పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులు శనివారం శ్రీసిటీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 2023కు సంబంధించిన పీఎఫ్ సొమ్ముతో పాటు, తమకు రావాల్సిన బోనస్ నగదును స్వాహా చేసేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దాదాపు రూ.20 లక్షలకు పైగా కార్మికుల పీఎఫ్, బోనస్ డబ్బులు కాజేశారని సమాచారం. ఈ వ్యవహారంలో పరిశ్రమలో కీలక విభాగంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత ఏజెన్సీ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుని, తమకు రావాల్సిన పీఎఫ్, బోనస్ నగదును తమ ఖాతాల్లో జమ చేసి న్యాయం చేయాలని కార్మికులు కోరుతున్నారు.

పుత్తూరులో నకిలీ నోట్ల కలకలం

● రూ.30 వేల రూ.500 నకిలీనోట్ల చలామణి ● తండ్రీకూతుళ్లు నిందితులు ● పోలీసులకు అప్పగించిన స్థానికులు

పుత్తూరు అర్బన్, నవంబర్ 09(ఆంధ్రజ్యోతి): పుత్తూరులో నకిలీ నోట్ల చలామణి కలకలం సృష్టించింది. శనివారం రాత్రి 7 గంటల సమయంలో నకిలీ నోట్ల చలామణి చేస్తున్న తండ్రీకూతుళ్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.15 వేల వరకు రూ.500 నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పుత్తూరులో బిజీబిజీగా ఉండే బజారు వీధి తదితర ప్రాంతాల్లోని చిల్లర దుకాణాలే లక్ష్యంగా నకిలీ నోట్ల మార్పునకు వీరు శ్రీకారం చుట్టారు. బాధితుల కథనం మేరకు.. ఓ ఫైనాన్సర్ దుకాణాల నుంచి రోజువారీ ఫైనాన్స్ నగదును కలెక్షన్ చేసుకుని తన వద్ద ఉన్న లెక్కింపు మిషన్‌తో లెక్కించారు. వాటిలో రూ.500 నోట్లు నకిలీవిగా గుర్తించారు. అప్రమత్తమైన ఫైనాన్సర్ సదరు దుకాణదారులకు సమాచారం అందించారు. అప్పటికే పలు దుకాణాలలో దాదాపు రూ.30 వేలకు పైగా రూ.500 నకిలీ నోట్లను తండ్రీ, కూతురు మార్పు చేశారు. రూ.50లకు చిన్నపాటి సరుకులు కొనుగోలు చేసి రూ.450 నగదును తిరిగి పొందేవారని గుర్తించారు. ఫైనాన్సర్ సమాచారంతో దుకాణదారులందరూ ఏకమై వారి కోసం జల్లెడపట్టారు. పుత్తూరు పోలీస్ స్టేషన్ ఎదుట వెళుతున్న వారిని గుర్తించి కానిస్టేబుల్ మురళికి సమాచారం ఇచ్చారు. వారిని అదుపులోకి తీసుకున్న కానిస్టేబుల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాధితులు వద్ద ఉన్న నకిలీ రూ.500ల నోట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు తిరుచానూరులో కాపురం ఉన్నట్లు వెల్లడైంది. తిరుపతిలో గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ఈ నకిలీ నోట్లను పొందినట్లు విచారణలో తేలింది. దీంతో అసలు నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని సీఐ సురేంద్రనాయుడు వెల్లడించారు.

రోడ్డుప్రమాదంలో ఆటో డ్రైవర్ దుర్మరణం



మునీంద్ర(ఫైల్‌ఫొటో)

శ్రీకాళహస్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఆటోను ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్ దుర్మరణం చెందాడు. ఈ ఘటన శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరు వద్ద నాయుడుపేట-రేణిగుంట జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. శ్రీకాళహస్తి రూరల్ సీఐ రవినాయక్ కథనం మేరకు.. తిరుచానూరు సమీపంలోని యోగిమల్లవరం గ్రామానికి చెందిన మునీంద్ర(35) ఆటో డ్రైవర్. ఊరందూరు వద్ద జాతీయ రహదారిపై ఆటోలో వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. మునీంద్ర అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఊరందూరు వద్ద మృతదేహాన్ని సుమారు మూడు గంటల పాటు అక్కడే ఉంచేశారు. మృతదేహాన్ని తరలించడంలో జాప్యం జరగడంపై ఉన్నతాధికారులు శ్రీకాళహస్తి రూరల్‌పోలీసులను మందలించినట్లు సమాచారం.

ముక్కంటి ఆలయ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం



రమేష్‌రాజు

శ్రీకాళహస్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయానికి చెందిన ఒప్పంద ఉద్యోగి ఆత్మహత్యకు యత్నించాడు. విధులకు అనధికారికంగా గైర్హాజరు అవుతున్నాడని రమేష్‌రాజు అనే ఒప్పంద ఉద్యోగిని అధికారులు నెల రోజుల క్రితం సస్పెండ్ చేశారు. అయితే తనను తిరిగి విధుల్లోకి తీసుకునేందుకు అధికారులు స్పందించడంలేదని పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. డ్యూటీ లేక కుటుంబ పోషణ భారం కావడంతో ఆత్మహత్యకు యత్నించినట్లు రమేష్‌రాజు వాపోయాడు.

వెటర్నరీవర్సిటీలో అధ్యాపకుల బదిలీలు

తిరుపతిరూరల్, నవంబరు9(ఆంధ్రజ్యోతి): ఏపీరాష్ట్రంలో తిరుపతికేంద్రంగా నడిచే ఎస్వీ వెటర్నరీ వర్సిటీ పరిధిలో అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్‌లో భాగంగా పలువురు ప్రొఫెసర్లు, సైంటిస్టులు, అధ్యాపకులకు బదిలీలు చేపట్టారు. తిరుపతిలోని ఎస్వీవెటర్నరీ, ప్రొద్దుటూరులోని వెటర్నరీ కాలేజ్, గన్నవరంలోని ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాల, వెంకట్రామన్నగూడెం, విశాఖపట్నం, రామచంద్రాపురం, వెన్నెలవలస, గుంటూరు కేవీకేలో పనిచేసే దాదాపు 26మందిని గిరివిడికి బదిలీ చేస్తూ శుక్రవారం వర్సిటీ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు శనివారం పలువురు రిలీవ్ అయినట్లు తెలిసింది.

రేపు జాబ్‌మేళా

తిరుపతి(కలెక్టరేట్) నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పద్మావతిపురంలోని ప్రభుత్వ ఐటీఐలో సోమవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్.లోకనాథం, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి శనివారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి జరిగే ఈ జాబ్‌మేళాలో పలు బహుళజాతి కంపెనీలలో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన యువతీ యువకులు అర్హులని తెలిపారు. ఆధార్‌కార్డు, విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్సు, బయోడేటా ఫాంతో సంబంధిత లింక్‌లో నమోదు చేసుకుని, అడ్మిట్ కార్డుతో హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 8555972657ను సంప్రదించాలని తెలిపారు.

క్రీడా రంగానికి పూర్వవైభవం : శాప్ చైర్మన్



పోటీలను తిలకిస్తున్న రవినాయుడు

తిరుపతి(క్రీడలు), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్రీడా రంగానికి పూర్వ వైభవం తీసుకొస్తామని శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు అన్నారు. శనివారం శ్రీనివాస క్రీడా సముదాయంలో ఫస్ట్ ఓపెన్ సౌతిండియా కరాటే చాంపియన్‌షిప్ పోటీలను టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహ యాదవ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. రవినాయుడు మాట్లాడుతూ తిరుపతిని క్రీడా వేదికగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉన్న క్రీడా వేదికలను డీఎస్ఏ(డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ)ఆధీనంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. 2027లో రాష్ట్రంలో నేషనల్స్ గేమ్స్ నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. కాగా, తొలి రోజు అండర్ 12 వ్యక్తిగత కట, కుమితే విభాగాలలో పోటీలు జరిగాయి. కార్యక్రమంలో డీఎస్‌డీవో సయ్యద్‌సాహెబ్, టీడీపీ సీనియర్ నాయకులు వూకా విజయకుమార్, ముబ్బు దేవనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంటలో రాష్ట్రస్థాయి ఘట్కా పోటీలు

రేణిగుంట, నవంబరు9(ఆంధ్రజ్యోతి): రేణిగుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి అండర్-17, 19 ఘట్కా క్రీడా పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి విశ్వనాథ్‌నాయక్, స్టేట్ పర్యవేక్షణ అధికారి బాలశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. 13 జిల్లాల నుంచి 150మంది క్రీడాకారులు, 30 మంది కోచ్‌లు, మేనేజర్లు హాజరయ్యారు. అందరికీ భోజన వసతి కల్పిస్తున్నట్లు హెచ్ఎం విష్ణువర్ధని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఘట్కా కార్యదర్శి సురేంద్ర, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు రేఖరాణి తదితరులు పాల్గొన్నారు.



ఘట్కా పోటీలను ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు

మా భూములు మాకు అప్పగించండి

● టవర్ ఎక్కిన కళత్తూరు దళిత రైతులు



కళత్తూరులో టవర్ ఎక్కిన దళిత రైతులు

కేవీబీపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): భూముల్లోకి వెళ్లకుండా అటవీ అధికారులు అడ్డుకుంటున్నారంటూ మండలంలోని కళత్తూరు దళిత రైతులు శనివారం ఉదయం సెల్ టవర్ ఎక్కారు. వారు మాట్లాడుతూ కళత్తూరు రెవెన్యూ బ్లాక్ నెంబరు.4లోని భూములను కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్నామని తెలిపారు. పది సంవత్సరాల నుంచి అటవీ, రెవెన్యూ అధికారులు ఈ భూములు తమవంటే తమవంటూ అడ్డంకులు కల్పిస్తున్నారన్నారు. రెవెన్యూ వారు ఏకంగా ఆ భూముల్లో కొంతమందికి పట్టాలు సైతం ఇచ్చారని తెలిపారు. ఇటీవల ఆ భూముల్లోకి ప్రవేశించిన రైతులపై అటవీ శాఖ వారు కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేసేవరకు దిగేది లేదని తేల్చి చెప్పారు. విషయం తెలుసుకున్న శ్రీకాళహస్తి తహసీల్దారు భానుప్రకాష్‌రెడ్డి, పుత్తూరు రూరల్ సీఐ రవీంద్ర, పిచ్చాటూరు ఇన్‌చార్జి ఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీసులు అక్కడికి చేరుకుని రైతులను కిందకు దించడానికి ప్రయత్నించారు. వారు ససేమిరా అనడంతో ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, ఎఫ్ఆర్వో రాధికారెడ్డి, సీఐ రవీంద్ర, ఎస్ఐ వెంకటేశ్వర్లు వంద రోజుల్లో సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇవ్వడంతో దిగి వచ్చారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలను ఎవరూ అడ్డుకోరని చెప్పడంతో శాంతించారు. కార్యక్రమంలో తహసీల్దారు మునిరత్నంరెడ్డి, పోలీసు సిబ్బంది అమరనాథనాయుడు, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులను అడిగి వివరాలు తెలుసుకున్న ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి

యాదమరిలో కుస్తీ సందడి

అండర్-17 రాష్ట్రస్థాయి పోటీలు ప్రారంభం





కుస్తీపోటీల్లో తలపడుతున్న బాలికలు


యాదమరి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): యాదమరి జిల్లాపరిషత్ ప్రభుత్వ పాఠశాలలో 68వ రాష్ట్రస్థాయి అండర్-17 కుస్తీపోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పోటీలను పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ ప్రారంభించి, ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి క్రీడాభివృద్ధికి అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందించి ప్రోత్సహిస్తోందని గుర్తుచేశారు. యాదమరి టీడీపీ అధ్యక్షుడు మురార్జీ యాదవ్, నాయకులు అమర్‌నాథ్ నాయుడు, హేమగిరి, డీవైఈవో చంద్రశేఖర్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బాలాజీ, జిల్లా సెక్రటరీ వసంతవాణి, ఎంఈవో రుక్మిణి, తహసీల్దార్ పార్థసారథి, ఎంపీడీవో వేణు, ప్రధానోపాధ్యాయులు గిరిరాజా, పీడీలు రవి, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తొలి రోజు చిత్తూరు బాలికలు ముందంజ

బాలబాలికల విభాగంలో మొత్తం పది విభాగాలుగా విభజించి పోటీలు నిర్వహించారు. ఒక్కో కేటగిరీలో అన్ని జిల్లాల నుంచి 13 మంది చొప్పున మొత్తం 130 మంది బాలికలు, 130 మంది బాలురు పాల్గొన్నారు. బాలికల మొదటి క్వాలిఫయింగ్ 30 రౌండ్లకు సంబంధించి చిత్తూరు జిల్లా జట్టు జయకేతనం ఎగురవేసి మొదటిస్థానంలో నిలవగా, విశాఖపట్నం రెండో స్థానంలో ఉంది.

ఆత్మ పరిశోధన చేసుకోవాలి

గరికపాటి నరసింహారావు



చిత్తూరు కల్చరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి వ్యక్తీ ఆత్మ పరిశోధన చేసుకుంటేనే సంపూర్ణ విజ్ఞాన వంతుడు అవుతాడని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు అన్నారు. స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో నారాయణి సేవా సమితి ఆధ్వర్యంలో యోగ వాసిష్ఠం (జ్ఞాన బోధ)లో భాగంగా శనివారం గరికపాటి ప్రవచించారు. మొదట ప్రతి వ్యక్తీ ఇంట్లో ఉన్న వృద్ధులైన తల్లిదండ్రులను గౌరవించి.. వారికి సేవలు చేసిననాడే నిజమైన సమాజ సేవకుడు అవుతాడని చెప్పారు.

భారీగా తగ్గిన టమోటా ధరలు

సోమల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : టమోటాల 15 కిలోల బాక్సు ధర రూ. 200కు చేరుకుంది. పది రోజుల వరకు 15 కిలోల బాక్సు రూ. 500 వరకు పలికింది. వారం రోజులుగా క్రమంగా తగ్గుముఖం పడడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఎకరా టమోటా సాగుకు రూ.1.50 లక్షలు వ్యయం చేయాల్సి వస్తోందని, దినసరి కూలీలకు రూ. 400 లకు మించి పోతోందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు చీడపీడలు అధికమై మందుల పిచికారీకి అధిక వ్యయం చేయాల్సి వస్తోందన్నారు.

చిరుత దాడిలో ఆవు మృతి



పాడి ఆవు కళేబరం

చౌడేపల్లె, నవంబర్9 (ఆంధ్రజ్యోతి) : చిరుత దాడిలో ఆవు మృతి చెందిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం మేరకు... చౌడేపల్లె మండలం పెద్దకొండామారి పంచాయతీ నాగిరెడ్డిపల్లెకు చెందిన వెంకటరమణరెడ్డి వారం క్రితం తన ఆవులను గ్రామసమీప పొలాల్లోకి మేతకు తీసుకెళ్లాడు. సాయంత్రమైనా మందలోని ఆవు కనిపించపోవడంతో గాలించినా ఆచూకీ తెలియలేదు. శనివారం పశువుల కాపర్లు నాగిరెడ్డిపల్లె, గడ్డంవారిపల్లె మధ్యలోని కందూర్ అటవీ ప్రాంతంలో పాడి ఆవు కళేబరాన్ని గుర్తించి ఆ రైతుకు సమాచారం అందించారు. వెంకటరమణ అటవీశాఖ, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని పాడి ఆవు కళేబరాన్ని పరిశీలించి, చిరుత దాడిలో మృతి చెందినట్లు తెలిపారు. తనకు జీవనాధారమైన రూ.40వేలు విలువచేసే ఆవు మృతి చెందడంతో ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఎఫ్ఆర్‌వో శ్రీరాములు మాట్లాడుతూ. చౌడేపల్లె మండలంలో చిరుత సంచరిస్తోందని, పశువుల కాపరులు, రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు.

చెరువును దున్నేశారు



ట్రాక్టర్‌తో దున్నేసిన పిక్కిలికుంట చెరువు

చౌడేపల్లె, నవంబర్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పిక్కిలికుంట చెరువును కొందరు దురాక్రమణ చేస్తున్నారు. మండలంలోని 29ఏ చింతమాకులపల్లె పంచాయతీ కెంగానపల్లె సమీపంలో ఉన్న పిక్కిలికుంట చెరువును అదే గ్రామానికి చెందిన ఉదయ్, వాసు కలసి 4 ఎకరాల చెరువును ట్రాక్టర్‌తో దున్ని అక్రమించుకున్నారు. ఈ విషయంపై గతవారం పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. రెవెన్యూ అధికారులుకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు అంటున్నారు. చెరువు ఆక్రమణకు గురైతే చెరువులోకి నీరు సక్రమంగా రావని, ఆయకట్టు భూములను బీళ్లుగా ఉంచుకోవాల్సి వస్తుందన్నారు. కలెక్టర్ స్పందించి చెరువు అక్రమణకు గురికాకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న పద్మజ

చిత్తూరు సెంట్రల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి పద్మజ పిలుపునిచ్చారు. న్యాయ సేవ దినోత్సవం పురస్కరించుకుని శనివారం స్థానిక ఆర్కే డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉంటే భవిష్యత్తులో సమాజంలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం చూపగలరన్నారు. డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మధుసూదన్, కళాశాల ప్రిన్సిపాల్ రమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రూ.కోట్లు కూడేసి ఏసీబీకి దొరికేశాడు

మాజీ ఆర్డీవో మురళి ఆస్తులపై విస్తృత సోదాలు - కీలక డాక్యుమెంట్లు, రిజిస్ట్రేషన్ పత్రాలు స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 9(ఆంధ్రజ్యోతి):ఆదినుంచీ వివాదాస్పద అధికారిగా పేరుబడ్డ డిప్యూటీ కలెక్టర్ మద్దాల సాకపు మురళి అనతి కాలంలోనే కోట్లు వెనకేసుకున్నాడని ఏసీబీ గుర్తించింది.2022లో మదనపల్లెకు ఆర్డీవోగా వచ్చిన మురళికి 2024 జనవరి 17న తహసిల్దారుగా ప్రభుత్వం రివర్షన్ ఇచ్చింది.గతంలో ప్రకాశం జిల్లాలో ఆర్డీవోగా పనిచేసిన సమయంలో సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట గ్రామంలో సర్వే నంబరు 344లో ఒంగోలు చారిటబుల్ సదావర్తి మఠానికి చెందిన ఇనాం భూములను అక్రమంగా ఇతరులకు కట్టబెట్టారన్న ఆరోపణలకు గురయ్యారు. సంబంధిత సర్వే నంబరులో 66.25 ఎకరాలను ఇతరులకు పట్టాలు కేటాయించి, పట్టాదార్ పాస్ పుస్తకాలు జారీ చేశారని ఆరోపణలు వచ్చాయి. దీనిపై మఠం ప్రతినిధులు ఫిర్యాదు చేయడంతో ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. అప్పటి జేసీ-2 విచారణ జరిపి ఆరోపణలు వాస్తవమని తేల్చి ప్రభుత్వానికి నివేదించారు. దానిపై ప్రభుత్వం ఈ ఏడాది జనవరి 17న ఆయనకు తహసిల్దారుగా రివర్షన్ ఇచ్చింది.కానీ అప్పటి ప్రభుత్వంలో కీలక నేతల మద్దతుతో కొంతకాలానికే ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల ఆలయ ఈవోగా పోస్టింగు సంపాదించారు.నెల తరువాత తిరుపతి కలెక్టరేట్‌లో లీగల్‌సెల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమితులయ్యారు.తరువాత మదనపల్లె ఆర్డీవో కార్యాలయంలో రెవిన్యూ ఫైళ్ళు దగ్ధమైన కేసులో ప్రభుత్వం మురళిని సస్పెండ్ చేసింది.ఈ నేపథ్యంలో పలు చోట్ల ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టాడని ఏసీబీ డీజీపీకి అందిన ఫిర్యాదుతో కడప, చిత్తూరు, తిరుపతి, నెల్లూరు, అన్నమయ్య జిల్లాల్లోని దాదాపు 65 ప్రాంతాల్లో ఏసీబీ జాయింట్ డైరెక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఏఎస్పీ విమలకుమారి పర్యవేక్షణలో దాదాపు 13 బృందాలు శనివారం ఏకకాలంలో సోదాలు నిర్వహించాయి.మురళిని ఏసీబీ అధికారులు తిరుపతిలోని అతని ఇంటి వద్ద శనివారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకున్నాక ప్రారంభించారు. శనివారం రాత్రి వరకు అందిన సమాచారం మేరకు తిరుపతి ఓటేరులోని ఎల్ఎన్‌కే రెసిడెన్సీలో కాపురమున్న మురళి ఇల్లు, ఎంకే నాయుడు కాలనీలోని ఎవర్ గ్రీన్ అపార్టుమెంటులో ప్లాటు నెంబరు 202లో కాపురమున్న ఆయన కుమారుడు లీలా సాయికృష్ణ, బైరాగిపట్టెడలోని స్నేహితుడు డిప్యూటీ తహసిల్దార్ శేషగిరి, విద్యానగర్ కాలనీలో వున్న సర్వేయర్ చిట్టిబాబు ఇళ్ళలో సోదాలు జరిగాయి. తిరుపతి సమీపంలోని తనపల్లి క్రాస్ వద్ద కుమారుడి పేరుతో వున్న సాయి గ్రాండ్ హోటల్‌లో సోదాలు చేస్తున్న ఏసీబీ బృందానికి పలు కీలక రికార్డులు దొరికినట్లు సమాచారం.వీటితో పాటు భారీ ఎత్తున ఆస్తులు కొనుగోలు చేసి బినామీ పేర్లతో వుంచిన డాక్యుమెంట్లును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తిరుపతిలో ఇప్పటి వరకు జరిగిన సోదాల్లో 50 సవర్ల బంగారు నగలు, వెండి వస్తువులు, లక్షలాది రూపాయల డబ్బు సీజ్ చేసినట్లు సమాచారం.బైరాగిపట్టెడలోని డిప్యూటీ తహసిల్దార్ ఇంటిలో కొన్ని కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. సర్వేయర్ చిట్టిబాబు ఇంటిలో మురళి పేరుతో వుంచిన బ్యాంకు లావాదేవీల పత్రాలు వున్నట్లు తెలిసింది.తిరుపతి పరిసర ప్రాంతాల్లో వ్యవసాయ భూములను కొనుగోలు చేసి ప్లాట్లు వేసి విక్రయించినట్లు విచారణలో వెల్లడైంది.మురళి వి.కోటవాసి కావడంతో అక్కడ రెండు పౌల్ట్రీఫారాలు, భూములు, ప్లాట్లు వున్నట్లు గుర్తించి అందుకు సంబంధించిన డాక్యుమెంట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పలమనేరు సమీపంలోని కీలపట్ల గ్రామంలో గుర్రప్ప పేరుతో వ్యవసాయ భూమి కొనుగోలు చేసిన పత్రాలు సీజ్ చేశారు. పలమనేరులో మురళి బంధువుల ఇళ్లలోనూ సోదాలు జరిపారు. పుంగనూరులో పీడీగా పనిచేసిన కాలంలో చుట్టుపక్కల గ్రామాల్లో ఆస్తులు కూడబెట్టాడనే ఆరోపణలున్నాయి. వైసీపీ హయాంలో జిల్లాకు చెందిన ఒక మంత్రి మద్దతుతో పలు ప్రాంతాల్లో అత్యంత విలువైన ఆస్తులు, భూములు, ఇళ్ళు, ప్లాట్లు కొనుగోలు చేసి బంధువులు, స్నేహితుల పేర్ల మీద వుంచినట్లు తెలియడంతో ఆ దిశగానూ అధికారులు సోదాలు చేస్తున్నారు. ఈ సోదాలు ఆదివారం కూడా కొనసాగనున్నాయి.మురళితో పాటు కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులకు సంబంధించిన బ్యాంకు లాకర్లపై ఏసీబీ అధికారులు దృష్టి సారించారు.



తిరుపతిలోని బైరాగిపట్టెడలో మురళి కుమారుడి ఇంట్లో ఏసీబీ తనిఖీలు

మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో కోటి వొత్తుల దీపం వెలిగించిన జడ్జి



కోటి వొత్తుల దీపాన్ని వెలిగిస్తున్న మదనపల్లె కోర్టు జడ్జి శిరీష్

చౌడేపల్లె, నవంబర్9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజయేశ్వర స్వామి ఆలయంలో కోటి వొత్తుల దీపాన్ని మదనపల్లె కోర్టు జడ్జి శిరీష్ కుటుంబ సభ్యులు వెలిగించారు. శనివారం రాత్రి ఆయన కుటుంబీకులు ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ధ్వజస్తంభం ముందు కోటి వొత్తుల నెయ్యి దీపాన్ని వెలిగించి మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

ముగ్గురు టీచర్లకు అవార్డులు



శ్రీధర్‌బాబు, సురేంద్రబాబు, శ్రీదేవి

చిత్తూరు సెంట్రల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు జిల్లా నుంచి ముగ్గురు ఎంపికయ్యారు. వీరిలో.. కె.శ్రీధర్‌బాబు (గంగవరం మండలం మైలుమై జడ్పీహెచ్ఎస్‌లో గ్రేడ్2 హెచ్ఎం), బి.సురేంద్రబాబు (ఐరాల మండల జడ్పీహెచ్ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్), డి.శ్రీదేవి (చిత్తూరు కృష్ణవేణి జూనియర్ కళాశాలలో జూనియర్ హిందీ లెక్చరర్) ఉన్నారు. వీరికి అవార్డులను విజయవాడలో సీఎం చంద్రబాబు సోమవారం అందజేయనున్నారు.

కల్లూరు వద్ద పంటలపై గజదాడులు





ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరిపంట - ట్రాక్టర్ ట్రాలీని దొర్లించిన ఏనుగులు

కల్లూరు,నవంబరు9(ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. కల్లూరు సమీపంలో శుక్రవారం రాత్రి ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేయడంతో పంటలకు అపారనష్టం వాటిల్లింది. చాకలికోన నుంచి శుక్రవారం రాత్రి బయలుదేరిన ఏనుగుల గుంపు పాతపేట సమీపానికి చేరుకున్నాయి. కల్లూరు ఉన్నత పాఠశాల సమీపంలోని బాషాసాహెబ్ మామిడితోటలోకి ప్రవేశించిన ఏనుగులు ట్రాక్టర్ ట్రాలీని దొర్లించాయి. అనంతరం మామిడిచెట్లను విరిచేశాయి. అక్కడి నుంచి పీలేరు రోడ్డులోని కొత్తకాలనీ వెనుకవైపునకు చేరుకున్నాయి. కల్లూరులో ఖాదర్‌వల్లికి చెందిన వరిపంటను ధ్వంసం చేసి 9 కొబ్బరిచెట్లను విరిచేశాయి. వెంకటదాసరపల్లిలో నడిపన్నకు చెందిన 13 కొబ్బరిచెట్లను ధ్వంసం చేశాయి. అక్కడి నుంచి గుట్టమీదపల్లి, పాళెం, కోటపల్లి మీదుగా చింతలవంకకు చేరుకున్నాయి. ఏనుగుల దాడిలో ధ్వంసమైన పంటలను అటవీశాఖ అధికారులు పరిశీలించారు.

కళా విన్యాసం

యువ తరంగ్‌లో రెండో రోజూ జోరుగా సాంస్కృతిక ప్రదర్శనలు









తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో యువ తరంగ్ జోరుగా హుషారుగా సాగుతోంది. రెండో రోజైన శనివారం కళాకారులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. కళా విన్యాసాలను న్యాయ నిర్ణేతలు తిలకించారు. నేటితో కార్యక్రమం ముగియనుంది.

ఉత్సాహంగా సాంస్కృతిక పోటీలు

యువ తరంగ్‌లో రెండో రోజైన శనివారం వివిధ సాంస్కృతిక పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. శాస్త్రీయ గానం, తాళం, లయ వాయిద్యాలు, సంగీత స్వర వాయిద్యాలు, లలిత సంగీతం, పాశ్చాత్య గానం, నృత్యం, ఫోక్ డ్యాన్స్, వక్తృత్వం, డిబేట్, స్పాట్ పెయింటింగ్, మట్టి బొమ్మల తయారీ తదితర పోటీలు నిర్వహించారు. సాయంత్రం శ్రీనివాసా ఆడిటోరియంలో సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

నేడు సమాపనోత్సవం

యువ తరంగ్ సమాపనోత్సవం ఆదివారం నిర్వహించనున్నారు. సాయంత్రం 6గంటలకు శ్రీనివాసా ఆడిటోరియంలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. తూర్పు రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ అప్పారావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు తదితరులు పాల్గొంటారు. ఈ మేరకు వర్సిటీ కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి తెలిపారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్ : పెద్దపంజాణి మండలం గద్దూరుకు చెందిన వెంకటరమణ(29) కుటుంబ కలహాలతో ఈగల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గుర్తించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు.

ఓటరు నమోదుకు నేడు ప్రత్యేక క్యాంపు

చౌడేపల్లె : ఓటరు జాబితాలో మృతుల ఓట్ల తొలగింపు, మార్పులు, చేర్పులకు ప్రతి పోలింగ్ కేంద్రం వద ఆదివారం ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ హనుమంతు తెలిపారు. 18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు.

కంటి ఆపరేషన్లకు 21 మంది ఎంపిక

కుప్పం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కుప్పం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పీఈఎస్ ఆసుపత్రి సౌజన్యంతో కుప్పంలో శనివారం ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పరీక్షలు చేసుకున్న వారిలో 21 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు లయన్స్ క్లబ్ అడ్వైజర్ ఎ.మహేశ్ తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కోశాధికారి చరణ్, సభ్యులు శివప్రసాద్, కృష్ణమూర్తి, ఏకాంబరం, కుప్పం డిగ్రీ కళాశాల అమిగోస్ విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సహకరించాలి

రామకుప్పం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : రామకుప్పం పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్ఐ వెంకటమోహన్ కోరారు. శనివారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో దుకాణదారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దుకాణల ముందు ఎవరూ రోడ్డుకడ్డంగా వాహనాలు నిలపకుండా చూడాలని సూచించారు. ప్రతి దుకాణం వద్ద సీసీ కెమెరాలు అమర్చుకోవాలన్నారు. దుకాణల ముందు ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తుంటే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని ఆయన కోరారు.

14న ప్రజా సమస్యలపై ధర్నా

పలమనేరు, నవంబరు9 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు సీపీఎం కార్యాలయం వద్ద శనివారం సీపీఎం నాయకులు ప్రజాపోరు పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు గిరిధరగుప్తా మాట్లాడుతూ ప్రజాపోరు కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రజాసమస్యలను అడిగి తెలుసుకొంటారన్నారు. ఈనెల 13వ తేది వరకు ఈ కార్యక్రమం కొనసాగించి అనంతరం ఈనెల 14వ తేది తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య, పట్టణ కార్యదర్శి రాజా, నాయకులు జయంతి, ధనమ్మ, లక్ష్మయ్య, రవి పాల్గొన్నారు.

రొంపిచెర్లలో రోడ్లు గుంతలమయం



గానుగచింత, రొంపిచెర్ల-ఎర్రావారిపాళం రోడ్డు మార్గాల్లో గుంతలు

రొంపిచెర్ల, నవంబరు 9 : (ఆంధ్రజ్యోతి) రొంపిచెర్ల మండలంలోని పలురోడ్లు గుంతలు పడి కొద్దిపాటి వర్షానికే నీరు చేరి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రొంపిచెర్ల-ఎర్రావారిపాలెం రహదారిలోపాటు పలు గ్రామీణ దారుల్లో గుంతలు పడ్డాయి. చిత్తూరు, మదనపల్లె, రాయచోటి, పీలేరు పట్టణాల నుంచి ప్రముఖ పుణ్యక్షేత్రం తలకోన కు ఈ మార్గం దగ్గరగా ఉండడంతో వాహనాల రాకపోకలు ఎక్కువగా వుంటాయి. అయితే గుంతల రోడ్లతో ఇబ్బంది పడుతున్నారు. అలాగే రొంపిచెర్ల నుంచి గానుగచింత మార్గంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సమీపంలో గుంతలుపడ్డాయి. ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చే వారు, మోటుమల్లెల, పెద్దమల్లెల, గానుగచింత పంచాయతీ ప్రజలకు ఆ రహదారి నరకంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా ముళ్ల కంపలు పెరిగి బస్సులు నడపలేక పోతున్నామని ఆర్టీసీ డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాల్సివుంది.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

పలమనేరు, నవంబరు9 (ఆంధ్రజ్యోతి) : ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ నరసింహరాజు హెచ్చరించారు. శనివారం పలమనేరు గంటావూరు కాలనీవాసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పలమనేరులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అసాంఘిక శక్తుల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ వున్నట్లు తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, మహిళల పట్ల దౌర్జన్యకరంగా ప్రవర్తించినా ఉపేక్షించమన్నారు. ప్రతిఒక్కరూ చట్టం గురించి అవగాహన వుండాలన్నారు. అనుమానాస్పద ఫోన్ కాల్స్ వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కాలనీల్లో కొత్తవారు కనిపించినా వారిపై నిఘా వుంచాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ స్వర్ణతేజ, సిబ్బంది పాల్గొన్నారు.


గంటావూరు కాలనీవాసులతో మాట్లాడుతున్న సీఐ నరసింహరాజు

తెలుగుదేశం పాలనలోనే సంక్షేమ పథకాలు

పుంగనూరు రూరల్, నవంబరు9(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం ప్రభుత్వ పాలనలోనే సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నట్లు టీడీపీ మండలాధ్యక్షుడు మాధవరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని బండ్లపల్లె పంచాయతీలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి సభ్యత్వం తీసుకోవడానికి ప్రజలు క్యూ కట్టుతున్నట్లు వివరించారు. రూ. 100 చెల్లించి సభ్యత్వం చేసుకున్న కార్యకర్తలకు బీమా రూ. 5లక్షలు వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో గంగధర్, మాధవ, చిన్నరెడ్డెప్ప, పెద్దరెడ్డెప్ప, శ్రీనివాసులురెడ్డి, కిరణ్, సోము, హరి పాల్గొన్నారు.

కుప్పం రూరల్ : కుప్పం మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదు జోరందుకుంది. చెక్కునత్తం పంచాయతీ అడవిములకపల్లెలో తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి చెక్కునత్తం మణి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేయించారు. కార్యక్రమంలో మణి, ఐటీడీపీ వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


పుంగనూరు మండలం బండ్లపల్లెలో టీడీపీ సభ్యత్వం చేయిస్తున్న టీడీపీ నాయకులు

రామకుప్పం : రామకుప్పం మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మునస్వామి, బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్రనారాయణాచారి, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నకృష్ణల ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపడుతున్నారు.

ఘర్షణ కేసులో ముగ్గురు వైసీపీ కార్యకర్తల అరెస్ట్

పుంగనూరు రూరల్: ఘర్షణ కేసులో ముగ్గురు వైసీపీ కార్యకర్తలను అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంటి వద్ద జరిగిన ఘర్షణ కేసులో పట్టణానికి చెందిన అన్వర్‌బాషా కుమారుడు అస్లాంబాషా(36), రహ్మతుల్లా కుమారుడు ఖాదర్‌వల్లీ(56), చెంగలాపురానికి చెందిన రామచంద్ర కుమారుడు నరసింహరావు(50)లను అరెస్ట్ చేసి న్యాయమూర్తి ముందు హాజరుపరచగా రిమాండ్ చెప్పినట్లు ఆయన తెలిపారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు కడపనత్తం విద్యార్థి



బైరెడ్డిపల్లె: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు కడపనత్తం జడ్పీఉన్నత పాఠశాల విద్యార్థి మణికంఠ ఎంపికైనట్లు హెచ్ఎం నందగోపాల్‌రెడ్డి, పీడీ చిరంజీవి తెలిపారు. ఈనెల 5వ తేది మదనపల్లెలో జరిగిన అండర్-14 వాలీబాల్ పోటీల్లో మణికంఠ ఎంపికైనట్లు చెప్పారు. ఈనెల 10,11తేదీల్లో విజయనగరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థికి హెచ్ఎం, పీడీ, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

మృత్యుంజయేశ్వరుడి సేవలో వాసవి నిత్యాన్నదాన ట్రస్టు రాష్ట్ర అధ్యక్షుడు



చౌడేపల్లె : వాసవి నిత్యాన్నదానం ట్రస్టు రాష్ట్ర అధ్యక్షుడు బనవాసి వాసు మృత్యుంజయేశ్వర స్వామిని శనివారం దర్శించుకున్నారు. ఉదయం ఆయన స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామికి, వాసవి కన్యకాపరమేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం నాయకులు నాగరాజ, చెన్నరాజశెట్టి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు



పలమనేరు, నవంబరు9 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు బస్టాండు నుంచి కుప్పం వెళ్లేందుకు ప్రయాణీకులతో బయలుదేరిన ఆర్టీసీ బస్సు కేవలం మూడు కిలోమీటర్లు వెళ్లగానే మొరాయించింది. దీంతో ప్రయాణీకులు డిపో అధికారులకు సమాచారం ఇచ్చారు. గంట తరువాత ప్రత్యామ్నాయ బస్సును ఏర్పాటు చేశారు. అంతవరకు ప్రయాణీకులు రోడ్డుపై పడిగాపులు పడ్డారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు పలమనేరు డిపోకు మంచి కండీషన్ బస్సులను పంపించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రొటోకాల్ రగడ విడ్డూరం

సోమల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సోమల మండల మీట్‌లో వైసీపీ ప్రజాప్రతి నిధులు ప్రొటోకాల్ రగడ చేయడం విడ్డూరంగా ఉందని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో టీడీపీ నాయకులు మాట్లాడుతూ అప్రజాస్వామ్యంగా ఎన్నికైన వైసీపీ ప్రజాప్రతినిధులు మండల సమావేశంలో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయడం సరికాదన్నారు. మాజీ సర్పంచు శ్రీనివాసులు నాయుడు, మాజీ ఎంపీటీసీలు రమేశ్ నాయుడు, శ్రీనివాసులు, శివశంకర్, మహేంద్రబాబు, సుబ్రమణ్యం యాదవ్, బాబురావ్, సదాశివయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు కంటి వైద్యశిబిరం

బైరెడ్డిపల్లి, నవంబరు9 (ఆంధ్రజ్యోతి) : బైరెడ్డిపల్లి ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఉదయం 10 గంటలకు శంకర నేత్రాలయ వైద్యులచే ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మురళీకృష్ణ, శ్రీనివాసులు, చంద్రశేఖర్ తెలిపారు. ఎంపిక చేసిన వారికి చెన్నై శంకరనేత్రాలయలో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తారన్నారు.

జనసేన పార్టీ ఆర్థిక సాయం

సోమల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సోమల మండలం గల్లావారిపల్లెకు చెందిన యువకుడు జి. పవన్ కుమార్‌కు జనసేన పార్టీ నాయకులు వీల్‌చైర్ అందించి ఆర్థిక సాయం అందజేశారు. నెలకిత్రం పవన్‌కుమార్ కొబ్బరి చెట్టు నుంచి ప్రమాదవశాత్తు జారిపడడంతో వెన్నుపూస దెబ్బ తిని ఇంటికే పరిమితమయ్యాడు. కందూరుకు చెందిన డాక్టర్ హరినారాయణ, జనసేన పార్టీ అభిమానులు బాధితుడిని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో కోలా శేఖర్, రామకృష్ణ, బండారు రఘు, ప్రభు, మునీర్ పాల్గొన్నారు.

చెరువు తూము లీకేజీకి అడ్డుకట్ట

సోమల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నపట్నం చెరువు ఇటీవల కురిసిన వర్షాలకు జలకళ సంతరించుకుంది. ఈ క్రమంలోనే చెరువు తూము లీకేజీతో నీళ్ల వృథాగా పంట పొలాల్లోకి మళ్లాయి. వరి పొలాలు దెబ్బతిన్నాయి. శనివారం పలువురు రైతులు, సర్పంచు రెడ్డెప్ప చొరవ తీసుకుని ఇసుక, సిమెంట్ బస్తాలతో లీకేజీని తాత్కాలికంగా అడ్డుకట్ట వేశారు.

చెన్నకేశవస్వామికి విశేష పూజలు

సోమల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సోమల పంచాయతీ చెన్నయ్యగారిపల్లెలో కొలువుదీరిన చెన్నకేశవస్వామి ఆలయంలో మూలవిరాట్‌కు భక్తులు విశేష అలంకరణ చేసి పూజలు చేశారు. అర్చకులు స్వామికి అర్చనలు, అభిషేక పూజలు జరిపారు. పలువురు అయ్యప్ప భక్తులు స్వామిని దర్శించుకుని రాత్రి జాగరణ చేస్తూ సంకీర్తనలు ఆలపించారు.

అత్తామామలపై కోడలు దాడి

పుంగనూరు రూరల్, నవంబరు9(ఆంధ్రజ్యోతి): అత్తామామలపై కోడలు దాడి చేసి గాయపరచడంతో పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పుంగనూరు మండలం ఇటుకనెల్లూరుకు చెందిన శ్రీరాములురెడ్డి, మాధవి దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఏడాది కాలంగా మాధవి సెల్‌ఫోన్‌లో ఎక్కువగా మాట్లాడుతున్నట్లు గుర్తించిన భర్త శ్రీరాములురెడ్డి భార్యను మందలించాడు. ఈ క్రమంలో భార్య, భర్త మధ్య గొడవలు జరుగుతుండగా మాధవి బంధువులు కొంతమంది శ్రీరాములురెడ్డిపై దాడి చేయగా తల్లిదండ్రులు లక్ష్మమ్మ, వెంకటరమణారెడ్డిలు అడ్డువెళ్లగా వీరిద్దరిపై కూడా దాడి చేసి గాయపరిచారు. గాయపడిన ఇద్దరినీ కుమారులు పుంగనూరు ఆసుపత్రికి తరలించారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

బైరెడ్డిపల్లి, నవంబరు9 (ఆంధ్రజ్యోతి) : బైరెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శనివారం మహతి ఫౌండేషన్ చైర్మన్ నాగరాజు సహకారంతో గర్భిణులకు వైద్యాధికారి విజయచందర్ పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గర్భిణులు తీసుకోవలసిన ఆరోగ్య జాగ్రత్తలు, పౌష్టికాహార ప్రాముఖ్యత, వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహతి ఫౌండేషన్ ప్రతినిధులు శాంతమ్మ, శ్రీనివాసలు, సీహెచ్‌ఓ అనూరాధ, ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

'చలో మదనపల్లె'ను విజయవంతం చేయండి

పలమనేరు, నవంబరు9 (ఆంధ్రజ్యోతి) : మదనపల్లెలో ఈనెల 14వ తేది జరగనున్న మాదిగల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎంఎస్‌పీ పలమనేరు ఇన్‌చార్జి వెంకటాచలం మాదిగ పిలుపునిచ్చారు. గంగవరం మండలం మబ్బువాళ్ల పేటలోని ఎస్సీ కాలనీలో శనివారం సమావేశం నిర్వహించి మాదిగలకు చలో మదనపల్లె కార్యక్రమాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ నాయకులు బాలన్న, రాము, కృష్ణప్ప, గోవిందప్ప, హరి, సరసమ్మ, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

బోయకొండ గంగమ్మ సేవలో టీటీడీ బోర్డు సభ్యుడు

చౌడేపల్లె, నవంబర్9 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మను టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి దర్శించుకున్నారు. శనివారం ఆయన అమ్మవారి దర్శనానికి రాగా ఆలయ ఈవో ఏకాంబరం స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించి, సత్కరించి, తీర్థప్రసాదాలు అందించారు. అలాగే బస్టాండ్‌లో ఉన్న మాజీ ఎంపీ నూతన కాలువ రామకృష్ణారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బగ్గిడి గోపాల్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

13 నుంచి సప్పలమ్మదేవి ఆలయ కుంభాభిషేక ఉత్సవాలు

బైరెడ్డిపల్లె, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలం లోని గుంతకురప్పల్లెలో నిర్మించిన సప్పలమ్మదేవి ఆలయ కుంభాభిషేక ఉత్సవాలు ఈనెల 13, 14 తేదీల్లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 13వ తేది గణపతి పూజ, గంగ పూజ, గోపూజ, వాస్తుహోమం, అంకురార్పణం, కలశ స్థాపన, విగ్రహప్రతిష్ఠ, 14వ తేది ప్రాణప్రతిష్ఠ, మహాభిషేకం, మహాపూర్ణాహుతి, మహా కుంభాభిషేకం జరుగుతుందన్నారు.

తల్లి పాలు పిల్లలకు ఆరోగ్యదాయకం

రొంపిచెర్ల, నవంబరు9 (ఆంధ్రజ్యోతి) : తల్లి పాలు పిల్లలకు ఆరోగ్యదాయకం అని వైదాధికారి వినయ్ చెప్పారు. శనివారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కింద గర్భిణులకు పరీక్షలు చేశారు. రక్తహీనత గల వారికి మందులు ఇచ్చి పౌష్టికాహారం గురించి వివరించారు. సురక్షితమైన ప్రసవం కోసం ప్రతి గర్భిణీ కాన్పు ప్రభుత్వ ఆస్పత్రిలో చేయించుకోవాన్నారు. శిశువు పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలని, ఈ పాలల్లో వ్యాధి నిరోధక శక్తి అధికంగా వుంటుందన్నారు. ఆరోగ్య విదాధికారి రాజేశ్వరి, సీహెచ్‌వో కాంతమ్మ, సూపర్‌వైజర్ పంకజాక్షి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇవి రోడ్లా?

భయాందోళనలో స్థానికులు

పెనుమూరు నుంచి చిత్తూరు వెళ్లే రోడ్డుపై ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనన్న భయాందోళనతో స్థానికులు ప్రయాణం సాగిస్తున్నారు. ఈ మార్గంలో చాలాచోట్ల రోడ్డు గుంతలమయం కావడమే దీనికి కారణం. రేణుకానగర్ వద్ద నడిరోడ్డుపై కల్వర్టుకు పెద్ద గుంత పడి నెలలు గడుస్తున్నా ఇంత వరకు ఎవ్వరూ పట్టించుకోలేదు. ఇక్కడ నాలుగు ప్రమాదాలు జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇదే మార్గంలో గంగుపల్లె చెరువు వద్ద రోడ్డు పనుల్లో భాగంగా ఎన్నికలకు ముందు కొంత దూరం రోడ్డును తవ్వేశారు. రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో ఇరుకు రోడ్డులో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇటీవల కారు బోల్తా కొట్టడంతో ఇద్దరు తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. కేసీ ఒడ్డిగుడిసెలు సమీపంలో రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. ఉగ్రాణంపల్లె వద్ద లింకు రోడ్డుపై గుంతలు ఉండటంతో తరచూ ద్విచక్రవాహనాలు కిందపడి గాయపడుతున్నారని స్థానికులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు, వాహనదారులు వాపోతున్నారు. -పెనుమూరు, ఆంధ్రజ్యోతి



మధ్య దారిలో పెద్ద గుంత

ఐరాలలోని వీఎస్ అగ్రహారంలోని ప్రధాన రహదారి మధ్యలో పెద్ద గుంత ఏర్పడింది. ఈ మార్గంలో రోజూ వందలాది వాహనాలు కాణిపాక క్షేత్రానికి వెళుతుంటాయి. అలాగే పాఠశాల, కళాశాలకు విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ గుంత వల్ల వాహనాలు రోడ్డుకు అంచున ప్రయాణిస్తుండటంతో ఎప్పుడే ప్రమాదం జరుగుతోందనని స్థానికులు భయపడుతున్నారు. - ఐరాల, ఆంధ్రజ్యోతి

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై రాజీ పడొద్దు

యాదమరి మండల మీట్‌లో ఎమ్మెల్యే మురళీమోహన్


సమావేశంలో ప్రసంగిస్తున్న మురళీమోహన్

యాదమరి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి విషయంలో రాజీ పడొద్దని అధికారులకు పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ సూచించారు. యాదమరి మండల సర్వసభ్య సమావేశం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే అధ్యక్షతన శనివారం ఉదయం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలో కరువు నివారణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. యాదమరి - గుడియాత్తం అంతర్రాష్ట్ర రోడ్డు మరమ్మతులకు ప్రత్యేక నిధులు కేటాయించి, నవంబరు చివరిలోపు భూమిపూజ చేసి పనులు మొదలుపెట్టనున్నట్లు తెలిపారు. సమావేశానికి ఎంపీపీ సురేష్‌బాబు, జడ్పీ వైస్‌చైర్మన్ ధనుంజయ రెడ్డి గైర్హాజరయ్యారు. మండల వైస్ ఎంపీపీలు రవీంద్రబాబు, హరినారాయణ రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి ఆలయంలో కాంట్రాక్టు పద్ధతిని రద్దు చేయండి

- ఏఈవోకు సీపీఐ వినతి

ఐరాల(కాణిపాకం), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిని రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు తదితరులు కోరారు. శనివారం ఆలయ ఏఈవో రవీంద్రబాబును కలసి ఈ మేరకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఆలయ అధికారులు.. దేవదాయశాఖ అధికారులతో చర్చించి 20 ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, శానిటేషన్ సిబ్బందికి కనీస వేతనం, ఈఎస్ఐ గుర్తింపు కార్డు, యూనిఫాం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా సమితి సభ్యులు గుర్రప్ప, రఘు, దామోదరం, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరుకు ఆర్టీసీ బస్సు ప్రారంభం

పాలసముద్రం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): టీపీఎస్ఆర్‌పురం నుంచి బెంగళూరుకు ఆర్టీసీ బస్సును ఎమ్మెల్యే డాక్టర్ థామస్ శనివారం ప్రారంభించారు. టీడీపీ కార్యనిర్వహక రాష్ట్ర కార్యదర్శి భీమినేని చిట్టిబాబునాయుడు, నేతలు శేఖర్‌రాజు, రమేష్, వాసుయాదవ్, అరుణ్‌నాథన్, తంగరాజ్,హరిరాజు, ఆర్ఎం జగదీష్, డీఎం రూపశ్రీ, అసిస్టెంట్ మేనేజర్ ఆల్ఫ్ పాల్గొన్నారు.

పశుగణనకు రైతులు సహకరించాలి

గుడిపాల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పశుగణనకు పాడిరైతులు సహకరించాలని గుడిపాల వైద్యాధికారి, సూపర్‌వైజర్ సాయిసుధ అన్నారు. శనివారం రామభద్రాపురం పంచాయతీ ముట్టుకూరుపల్లెలో జరుగుతున్న కార్యక్రమాన్ని పరిశీలించారు. వెటర్నరీ సిబ్బంది కిశోర్ పాల్గొన్నారు.

పూతలపట్టు: మండలంలోని పి.కొత్తకోట పంచాయతీ మోటకంపల్లి గ్రామంలో శనివారం పశుగణన కార్యక్రమాన్ని నిర్వహించారు. పశువైద్యాధికారులు శివనాగరాజు, సుదర్శన్ రెడ్డి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జలాశయంలో బోటింగ్ ఏర్పాటుకు కృషి

చెరువులకు నీటి అనుసంధానం పనులు ప్రారంభించండి: ఎమ్మెల్యే థామస్


అధికారులతో కలిసి జలహారతి ఇస్తున్న ఎమ్మెల్యే

పెనుమూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండలం కలవగుంటలో ఉన్న ఎన్టీఆర్ జలాశయం నుంచి పెనుమూరు, జీడీనెల్లూరు మండలాల్లోని 32 చెరువులకు నీటి అనుసంధానం పనులను ప్రారంభించాలని ఎమ్మెల్యే థామస్ అన్నారు. శనివారం ఇరిగేషన్ అధికారులతో కలిసి జలాశయాన్ని సందర్శించారు. నిండు కుండలా ఉన్న జలాశయానికి హారతి ఇచ్చి గంగమ్మకు వస్త్రాలు సమర్పించారు. జలాశయంలో బోటింగ్ ఏర్పాటుకు అనువుగా ఉందని, సంబంధిత మంత్రితో మాట్లాడి పనులను ప్రారంభించేలా కృషి చేస్తానని చెప్పారు. ఇరిగేషన్ సీఈ శ్రీనివాస్, ఎస్ఈ విజయ్‌కుమార్, ఈఈ మురళీకుమార్, డీఈ జయచంద్రబాబు, ఏఈ భరత్‌రెడ్డి, విద్యుత్ శాఖ ఏఈ తులసీ ప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు రుద్రయ్యనాయుడు, నాయకులు హరిబాబునాయుడు, మనోహర్‌రెడ్డి, సురేష్‌చౌదరి, నరేంద్ర, గుణ తదితరులు పాల్గొన్నారు.

సీఆర్ రాజన్‌కు సన్మానం



శ్రీరంగరాజపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వన్నియ కుల క్షత్రియ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్‌ను నియమించడంతో శనివారం స్వగృహంలో ఆయన్ను ఎస్ఆర్‌పురం నాయకులు సన్మానించారు. వన్నియకుల క్షత్రియ జిల్లా నాయకుడు విజయ్ కుమార్, ఐటీ వింగ్ టీడీపీ యువ నేత బాలు, జిల్లా కార్యవర్గ సభ్యులు రాజశేఖర్ నాయుడు, బ్రహ్మ నాయుడు, మాధవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సరైన పత్రాల్లేకుంటే వాహనాల సీజ్: సీఐ

చిత్తూరు అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వాహనాలకు సరైన పత్రాలు లేకుంటే సీజ్ చేస్తామని రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్య తెలిపారు. శనివారం ఇరువారం క్రాస్, కాణిపాకం జంక్షన్ వద్ద వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని చేపట్టారు. 50 ద్విచక్ర వాహనాలకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనాలకు నెంబర్లు కనపడే విధంగా ప్లేట్లను అమర్చుకోవాలన్నారు. ఎస్ఐ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

213 క్లెయిమ్‌ల స్వీకరణ

గంగాధరనెల్లూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ వ్యాప్తంగా పోలింగ్‌కేంద్రాల వద్ద నిర్వహించిన స్పెషల్ క్యాంపెయిన్ కార్యక్రమంలో 213 క్లెయిమ్‌లను స్వీకరించినట్లు ఎన్నికల డీటీ కరణం మోహన్ రాజ తెలిపారు. గంగాధరనెల్లూరు మండలంలో శనివారం అగరమంగళం, జంగాలపల్లె, కాళేపల్లె, పాచిగుంట గ్రామాల్లోని పోలింగ్‌కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు.

ప్రత్యేక ఓటరు క్యాంపునకు బీఎల్వోల డుమ్మా

పెనుమూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా అధికారుల ఆదేశాలతో శని, ఆదివారాలు ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటరు జాబితాలో మార్పు చేర్పులు, సవరణలు చేపట్టాలని బీఎల్వోలకు తహసీల్దారు శ్రావణ్‌కుమార్ సూచించారు. ఈ రెండ్రోజులపాటూ ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండాలని చెప్పారు. అయితే సగం పోలింగ్ కేంద్రాల్లో బీఎల్వోలు లేకపోవడంతో ఓటర్లు ఆయా చోట్లకొచ్చి వెనుతిరిగారు. పర్యవేక్షించాల్సిన సూపర్‌వైజర్లు రాలేదని సమాచారం.

రైతులకు నష్టం జరగకుండా ప్రాజెక్టు నిర్మించండి

అధికారులకు ఎమ్మెల్యే సూచన


రైతులతో మాట్లాడుతున్న థామస్

వెదురుకుప్పం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులకు నష్టం జరగకుండా ప్రాజెక్టు నిర్మించాలని అధికారులకు జీడీనెల్లూరు ఎమ్మెల్యే థామస్ సూచించారు. శనివారం కార్వేటినగరం మండలం ముక్కరవానిపల్లె వద్ద ప్రాజెక్టు నిర్మాణ స్థల పరిశీలనకు ఇరిగేషన్‌శాఖతో కలసి వచ్చి రైతులతో చర్చించారు. ప్రాజెక్టు నిర్మాణం వద్దంటే నిధులు వెనక్కి వెళ్లిపోతాయని చెప్పారు. టీడీపీ నేతలు చెంగల్రాయయాదవ్, రాజేంద్రరెడ్డి, భీమనేని చిట్టిబాబునాయుడు, గురుసాల కిషన్‌చంద్, బీగాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి: 108 సిబ్బంది నిరసన



నగరి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలంటూ నగరిలో 108 వాహన సిబ్బంది శనివారం నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ.. అరబిందో యాజమాన్యం, అధికారులు తమ సమస్యలను పరిష్కరించడంలో చొరవ చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లతో సంబంధం లేకుండా ప్రభుత్వమే 108 వాహనాలను నడపాలని కోరారు. అలాగే పలు సమస్యలను ప్రస్తావించారు. తమ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర కమిటీ పిలుపుతో సమ్మె నిర్వహించడం జరుగుతుందని హెచ్చరించారు.

కటారి హేమలతకు అభినందనలు



చిత్తూరు సిటీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు అర్బన్ అథారిటీ డెవలప్‌మెంట్ (చుడా) చైర్‌పర్సన్‌గా నియమితులైన మాజీ మేయర్ కటారి హేమలతకు టీడీపీ శ్రేణులు అభినందనలు తెలిపాయి. అలాగే గంగనపల్లె నుంచి ఎంజీఆర్ వీధి, ఎమ్మెస్సార్ సర్కిల్, గాంధీ విగ్రహం, నగర పాలక సంస్థ కార్యాలయం వరకు ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఇక దివంగత కటారి అనురాధ దంపతుల సమాధికి, నగరపాలక సంస్థలోని వారి విగ్రహాలకు కటారి హేమలత పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం గాంధీ, ఎన్టీఆర్ విగ్రహాలకు పుష్పాంజలి సమర్పించారు. నేతలు చెన్నకేశవులు నాయుడు, వరుణ్ కుమార్, కేసీ కిరణ్, కటారి లావణ్య, సతీష్, గోపి, సీఎం విజయ, గుణశేఖర్ నాయుడు, అశోక్, జయలక్ష్మి, కంద, రాణి, వరలక్ష్మి, కోలా కిరణ్, దుర్గ, కుమార్, ఓఎం రామదాసు, రాజశేఖర్ నాయుడు, డేగల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీకి రాకుంటే వైసీపీ ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలి: టీడీపీ


మీడియాతో మాట్లాడుతున్న సురేంద్రకుమార్

చిత్తూరు సిటీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీకి రాకుంటే వైసీపీ ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీకి వెళ్లకుండా రోజూ మీడియా ముందు మాట్లాడతానని మాజీ సీఎం జగన్ రెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. వైసీపీ సోషల్ మీడియా సభ్యులు ఒక గ్యాంగ్‌గా ఏర్పడి ఫొటోలు మార్ఫింగ్ చేసి, అసభ్య పదజాలంతో ప్రముఖ వ్యక్తుల వ్యక్తిత్వాన్ని హననం చేసే విధంగా పోస్టులు పెడుతున్నారని మండిపడ్డారు. ఇలాంటి వారిపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో చెప్పాలన్నారు. నేతలు మోహన్ రాజ్, సునీల్ కుమార్ చౌదరి, వెంకటేష్ యాదవ్, విజయ్ కుమార్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్టియన్లకు ఎస్సీ రిజర్వేషన్లు చట్ట విరుద్ధం

ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక

చిత్తూరు అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): క్రిస్టియన్లకు ఎస్సీ రిజర్వేషన్లు కల్పించడం చట్టవిరుద్ధమని ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి జాషువా తెలిపారు. శనివారం వారు కలెక్టరేట్‌లో అధికారులను కలిసి వినతిపత్రాన్ని ఇచ్చారు. మతం మార్చుకున్న వారిని ఎస్సీల జాబితా నుంచి తొలగించాలని డిమాండ్‌చేశారు. నేతలు హరికృష్ణమూర్తి, దేవరాజులు, మోహన్, వెంకటాచలం, కృష్ణమూర్తి, శ్రీనివాసులు, కుమార్, జితేంద్రన్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యంపై కేసు నమోదు


సావిత్రమ్మ

గుడిపాల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గుడిపాల మండలం రామభద్రాపురం పంచాయతీ బుచ్చన్నకండ్రిగ గ్రామానికి చెందిన మొగిలినాయుడు తల్లి సావిత్రమ్మ (60) గురువారం సాయంత్రం ఏడు గంటల నుంచి కనబడటం లేదు. దీంతో శనివారం ఆమె కుమారుడు మొగిలినాయుడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాంమోహన్ తెలిపారు.

1,800 లీటర్ల సారా ఊట ధ్వంసం

నగరి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): విజయపురం మండలంలోని కేవీపురంలో 1,800 లీటర్ల సారా ఊటను నగరి ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ పోలీసులు శనివారం ధ్వంసం చేశారు. శనివారం నగరి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులురెడ్డి సూచనతో కేవీపురం గ్రామానికి తూర్పు, దక్షిణం దిశలో ఉన్న గురుస్వామి చెరువు వద్ద జరిపిన దాడుల్లో సారా ఊటను ధ్వంసం చేశారు.

సంక్షిప్తంగా..

అఖండ నామ సంకీర్తన

చిత్తూరు కల్చరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో శనివారం సాయంత్రం సత్యసాయి గ్లోబల్ అఖండనామ సంకీర్తన కార్యక్రమాన్ని సత్యసాయి భజనమండలి సభ్యులు ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఆదివారం సాయంత్రం ఆరు గంటల వరకు నిర్వహించనున్నట్లు సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు మధుసూదనం తెలిపారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

విజయపురం, నవంబరు 9: మండలంలోని అర్హులందరూ ఓటరుగా తమ పేరు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ కిరణ్ సూచించారు. 18 ఏళ్లు నిండిన వారంతా బీఎల్వో వద్ద ఉన్న దరఖాస్తు ఫారాలను పూరించాలన్నారు. శనివారం అన్ని పంచాయతీ కేంద్రాల్లో బీఎల్వోలు, రెవెన్యూ సిబ్బంది.. ఓటరు జాబితాలను పరిశీలించారు. డీటీ అశోక్, సర్వేయర్ శేఖర్, సీనియర్ అసిస్టెంట్ కోదండయ్య, ఏఎస్‌వో రూప, వీఆర్వోలు పాల్గొన్నారు.

కరియమాణిక్య స్వామి సేవలో రోజా



నగరి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం తొలి శనివారం సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత కరియమాణిక్యస్వామిని శనివారం మాజీమంత్రి రోజా దర్శించుకున్నారు. అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

'ట్రూ అప్ చార్జీలను ప్రభుత్వమే భరించాలి'

చిత్తూరు అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ట్రూ అప్ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని ప్రభుత్వ కళాశాల రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అజ్మతుల్లా అన్నారు. శనివారం స్థానిక పెన్షనర్స్ హోంలో ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ యూనివర్సిటీ, డిగ్రీ కాలేజ్ ఆర్గనైజేషన్ నేషనల్ సెక్రటరీ కేశవులరెడ్డి అధ్యక్షతన ప్రజా సంఘాల సదస్సు నిర్వహించారు. చిత్తూరు నగర అభివృద్ధి కార్యదర్శి సురేంద్రనాథ్, ద్వారకనాథ్, శ్రీనివాసమూర్తి, న్యాయవాది చక్రవర్తి, ముస్లిం ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు నౌషద్, రసీద్, మునస్వామి, రాబర్టు, రమేష్ పాల్గొన్నారు.

లింగ వివక్ష తగదు

చిత్తూరు కల్చరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): లింగవివక్ష తగదని.. సృష్టిలో ఆడ, మగ సమానులేనన్న విషయాన్ని గుర్తించుకోవాలని ప్రముఖ రచయిత్రి విజయభండారు అన్నారు. శనివారం ఓ ప్రైవేటు విద్యాసంస్థలో జరిగిన జిల్లా రచయితల సంఘం నెలవారీ సాహితీ స్రవంతి కార్యక్రమంలో తను వెలువరించిన యోధ కథల సంపుటిని పరిచయం చేశారు. ఆమెను రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు కట్టమంచి బాలకృష్ణారెడ్డి, కుప్పం రెడ్డెమ్మ సాహితీ సంస్థ వ్యవస్థాపకురాలు కె.రామలక్ష్మి, శైలజాకుమారి సత్కరించారు.

ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్న చంద్రబాబు: టీడీపీ

గంగాధరనెల్లూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజల జీవితాల్లో సీఎం చంద్రబాబు.. వెలుగులు నింపుతున్నారని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఈమేరకు టీడీపీ యాదవ సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, పార్లమెంట్ వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి కామసాని కోదండరెడ్డి, పార్లమెంట్ టీఎన్ఎస్ఎఫ్ అధికార ప్రతినిధి కేతినేని లోకేష్‌నాయుడు, నియోజకవర్గ ముస్లిం మైనారిటీసెల్ ప్రధానకార్యదర్శి నియాజ్‌అలీ, మండల బీసీ సెల్ అధ్యక్షుడు జ్యోతియాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

మద్యం విక్రేత అరెస్టు

బంగారుపాళ్యం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాగిమానిపెంటకు చెందిన ఈశ్వరయ్య గ్రామంలో బెల్టుషాపు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో శనివారం అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 33 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. బెల్టుషాపులపై 94407 96736 నెంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం: టీడీపీ

శ్రీరంగరాజపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు అన్నారు. శనివారం ఎమ్మెల్యే థామస్ ఆదేశాలతో ఎస్ఆర్‌పురంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. బాబునాయుడు రవి, త్యాగరాజులు నాయుడు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా సభ్యత్వ నమోదు

విజయపురం: మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదు జోరుగా జరుగుతోంది. ఇళ్లత్తూరులో శనివారం జరిగిన కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, మండల అధ్యక్షుడు రమేష్ రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, నాయకులు మునిభాస్కర్‌రాజు ఏకుమళై, వరదరాజులు, బాబునాయుడు, గుణభూషణమ్మ, మనోజ్‌కుమార్, సుధాకర్‌రాజు, బాబు, దొరైరాజ్, గోవర్ధన్, మురళి, శివలింగం పాల్గొన్నారు.

గుడిపాల: పంచాయతీలో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు శనివారం పరిశీలించారు. నాయకులు సాంబశివ నాయుడు, శంకర్ చౌదరి, రవినాయుడు, శేఖర్, గోపి, కార్యకర్తలు పాల్గొన్నారు.

'కురబ కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఉమ్మడి చిత్తూరు జిల్లాకు కేటాయించాలి'

చిత్తూరు సిటీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కురబ కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఉమ్మడి చిత్తూరు జిల్లాకు కేటాయించాలని టీడీపీ బీసీ సెల్ పలమనేరు అధ్యక్షుడు, రాష్ట్ర కురబ సంఘం గౌరవాధ్యక్షుడు నాగభూషణం డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కురబలకు రాజకీయంగా ఉన్నతస్థానం కల్పిస్తామని ప్రతిపక్షంలో ఉన్నపుడు సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. జిల్లాలో కురబలకు ఎమ్మెల్యే, ఎంపీ సీట్లను కూడా కేటాయించలేదని అన్నారు. నేతలు వెంకటరమణ, సుబ్రమణ్యంగౌడ్, బత్తిగౌడు, జనార్ధన్‌గౌడు, శ్యామల కాంతారావు, సురేష్, గౌరప్ప పాల్గొన్నారు.